క్లుప్తంగా

ఉపకార వేతనాలకు ఎంపిక


జాహ్నవి,


సత్య

శిరివెళ్ల: గోవిందపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని హెచెం నాగలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఎంపిక పరీక్షల్లో 8వ తరగతి విద్యార్థులు జాహ్నవి, సత్య ఎంపికయ్యారన్నారు. వీరికి ఏటా కేంద్ర ప్రభుత్వం రూ.12 వేలు నాలుగేళ్ల పాటు ఉపకారవేతనాలు అందజేస్తుందని చెప్పారు. ఎంపికపై గ్రామస్తులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నంద్యాలలో సహేరి ప్రదేశాలు

నంద్యాల(వ్యవసాయం): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం విద్యార్థులు, ప్రయాణికులు తదితరులకు పట్టణంలో పలు చోట్ల సహేరి ఏర్పాటు చేసినట్లు ముస్లిం నాయకుడు అల్తాఫ్ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉప్పరిపే టలోని మజీద్‌ఏ దాయి హలీమా గాంధీ చౌక్‌లో గులాబ్‌షాహీ దర్గా, నడిగడ్డలో మజీద్‌ఏ ఆరీఫిన్, నబీ నగర్‌లో మజీద్‌ఏ రజియా, మాల్దారిపేటలో మజీద్ సర్వర్ ఏ కౌనైన్, సలీంనగర్‌లో మజీద్‌ఏ హంజా, టెక్కె మార్కెట్‌యార్డులో జెడ్‌ఎం ఫ్రూట్స్, బస్టాండ్‌లో హోటల్ బ్లూస్టార్, గాంధీచౌక్‌లోని కూరగాయల మార్కెట్‌లోని మజీద్‌యే ఆదామ్ సఫీవుల్లా, ఎస్‌జీటీఎస్ కాలనీలోని మజీద్‌ఏ ముగ్బుల్‌ఏ ఆలాం, బొమ్మలసత్రంలోని మజీద్‌ఏ మదీనా, రోజాకుంటలో మజీద్‌ఏ రోషన్, చాంద్‌బాడలో మజీద్‌ఏ బదర్, పోలీసు లైన్‌లోని మజీద్‌ఏ హుదా, సాయిబాబానగర్‌లో మజీద్‌ఏ కుబ్రా, నూనెపల్లెలో మజీద్‌ఏ జామియా, ఆర్‌ఎస్ రోడ్డులోని మజీద్‌ఏ అలీ నందు సహేరి ఏర్పాట్లు చేశామని వివరించారు. ఉపవాస దీక్షలు చేపిస్తున్న ముస్లింలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'బార్' ఎన్నికలు ఏకగ్రీవం


బార్ అసోసియేషన్‌కు ఎన్నికైన సభ్యులు

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. న్యాయవాదులు అందరూ ఒకే తాటిపైకి వచ్చి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కోర్టు ఆవరణలో 2023 -24 సంవత్సరానికి సంబంధించి బార్ అసోసియేషన్‌కు నామినేషన్ల గడువు ముగిసేసరికి అన్ని పదవులకు ఒక్కొక్క నామినేషన్ ఉండటంతో శుక్రవారం పోటీలో ఉన్న సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఇందులో అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా సూర్యనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, జనరల్ సెక్రటరీ అంబటి గోపాల్‌రెడ్డి, ట్రెజరర్ నెరెళ్ల మురళీమోహన్, లేడీ రిప్రజెంటేటివ్ రమాదేవి ఎన్నికయ్యారు. కాగా..సూర్యనారాయణ రెడ్డి వరుసగా ఆరుసార్లు గెలుపొందారు.దీంతో న్యాయవాదులు ఆయనకు అభినందనలు తెలిపారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(సిటీ): నంద్యాల అర్బన్ లెవల్‌లో విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక టౌన్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి సచివాలయ సెక్రటరీ తమ పరిధిలో నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలని చెప్పారు. పాఠశాలల తనిఖీ, విద్యార్థుల డ్రాప్ అవుట్, పీఎంజేఏవై సర్వే, మహిళా పోలీసులు వార్డుల్లో తనిఖీ చేయాలని ఆదేశించారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, ఎంహెచ్‌ఓ డాక్టర్ అంకిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన 'బార్' పదవీ కాలం



మాట్లాడుతున్న పెద్ది శ్రీనివాసులు

నంద్యాల(వ్యవసాయం): 2022-23 సంవత్సరానికి గాను బార్ అసోసియేషన్ సభ్యుల పదవీ కాలం శుక్రవారంతో ముగిసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పెద్ది శ్రీనివాసులు, కోటపాడు శ్రీనివాసులు తెలిపారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. గత సంవత్సరంలో అభివృద్ధి చేసిన కార్యక్రమాలు,సేవల గురించి న్యాయవాదులకు వివరించారు. అలాగే ఎన్నికల కమిటీ సభ్యులుగా సీనియర్ న్యాయవాదులు రామకృష్ణయ్య, నర్సింగరావు, రాజేశ్వరరెడ్డి, సుదాంశరెడ్డి, షేక్ షన్ను నియమించబడ్డారు. ఈ నెల 27 నుంచి నామినేషన్, 28న విత్‌డ్రాయల్, 31న ఎన్నికలు నిర్వహిస్తామని సీనియర్ న్యాయవాదులు తెలిపారు.



ఇటీవల కురిసిన వర్షాలకు రుద్రవరం సమీపంలో నేలవాలిన మొక్కజొన్న పంట, డీ.కొట్టాల వద్ద ఒరిగిన వరి పైరు


నర్సాపురం సమీపంలో బస్తాల్లో నింపిన మొక్కజొన్నలు

అకాల వర్షం.. ఆందోళనలో రైతాంగం

- గాలి, వడగండ్ల వానతో నేల వాలిన పంటలు
- భారీగా నష్టపోయిన అన్నదాతలు
- మరోమారు ఈనెల 24 నుంచి వర్షాలంటూ వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు
- వేగంగా సాగుతున్న మొక్కజొన్న కోతలు


ఎల్లావత్తుల వద్ద నేల వాలిన మొక్కజొన్న కోత కోస్తున్న యంత్రం

రుద్రవరం: వేలాది రూపాయల పెట్టుబడి, ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తే..చేతికందే సమయానికి అకాల వర్షాల రూపంలో ప్రకృతి కన్నెర్ర చేస్తుండటంతో అన్నదాత విలవిల్లాడిపోతున్నాడు. ఏపుగా పెరిగిన పైరును చూసి రేపోమాపో దిగుబడిని ఇంటికి తీసుకెళ్లొచ్చని సంతోషంగా ఉన్న సమయం ఎంత సేపు నిలవలేదు. గాలి, వడగండ్ల వాన రూపంలో పంట నేలపాలవగా, కోసి ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి ముద్దయ్యింది. దీంతో ఏమి చేయాలో పాలుపోక అన్నదాత కన్నీరుమున్నీరవుతున్నాడు. వారం క్రితం అకాల వర్షం కారణంగా పంటలు నష్టపోయిన రైతన్నకు వాతావరణ శాఖ మరో హెచ్చరిక జారీ చేసింది. ఈనెల 24వ తేదీ నుంచి వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొనడంతో రైతన్నలు ముందస్తుగా అప్రమత్తమవుతున్నారు. చేతికొచ్చిన మొక్కజొన్న నూర్పిడి పనుల్లో బిజీగా ఉన్నారు. ఇక చేతికందిన ధాన్యాన్ని కొందరు విక్రయిస్తున్నారు.

అధికంగా వరి, మొక్కజొన్న సాగు..

మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో రబీ సీజన్‌లో రైతులు దాదాపు 6వేల హెక్టార్లలో వరి, 2,200 హెక్టార్లలో మొక్క జొన్న, మరో 2వేల హెక్టార్లలో మినుము, ఆముదము వంటి పంటలు సాగు చేశారు. ఒక్కో ఎకరాకు పంటల సాగుకు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పశు పక్షాదులు,తెగుళ్ల వంటివి సోకకుండా పంటలను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. వరి కంకి దశలో ఉంది. మొక్కజొన్న ఇటీవల కోతలు మొదలయ్యాయి. దిగుబడులు మంచిగా వస్తున్నాయి. ధర కూడా ఆశాజనకంగా ఉంది. మంచి లాభాలు వస్తున్నాయని రైతులు ఎంతో సంబరంగా ఉన్నారు. ఈ క్రమంలో భారీ వర్షం కురవచ్చని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంతో నర్సాపురం, ఆలమూరు, చిత్రేనిపల్లె, ముకుందాపురం, తిమ్మనపల్లె, అప్పనపల్లె, పెద్దకంబలూరు, డీ.కొట్టాల తదితర గ్రామాలకు చెందిన కొందరు రైతులు వెంటనే మొక్కజొన్న కోతలు ప్రారంభించారు. వచ్చిన దిగుబడులను ఆరబోసి విక్రయాలు సాగించేలోపే వారం క్రితం భారీగా గాలులు వీస్తు వడగండ్ల వర్షం కురిసింది. మండలంలోని ఆయా గ్రామాల్లో వరి 412 హెక్టార్లు, మొక్కజొన్న 819 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు అంచనాలు వేశారు.వ ర్షం తెరపివ్వగానే ఆయా గ్రామాలకు చెందిన కొందరు రైతులు కూలీల సాయంతో నేలవాలిన వరి, మొక్కజొన్న పంటలను నిలిపి కట్టలుగా కట్టారు. పంట కాలం పూర్తి అయిన మొక్క జొన్న కోతలను సాగించి ధాన్యం దిగుబడులను ఆరబెట్టి విక్రయించుకుంటున్నారు. ఒక్కో ఎకరానికి 33 నుంచి 52 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయి. అయితే నేలవాలిన మొక్క జొన్న కోతలు సాగించేందుకు ఖర్చులు అధికమవుతున్నాయి. వర్షం కురవడంతో వ్యాపారులు కూడా ధరలను కుదించారు. గతంలో మొక్కజొన్న క్వింటా రూ.2300 ఉండగా ప్రస్తుతం రూ.2వేల ప్రకారం కొనుగోలు చేస్తున్నారు. అయితే ఇంకా కంకి దశలో ఉన్న మొక్క జొన్న పంటల రైతులు మాత్రం తమకు నష్టాలు తప్పవని వాపోతున్నారు.

ఈనెల 24 నుంచి వర్షాలు..

మొక్కజొన్న కోతలు వేగంగా సాగుతున్న ఈ తరుణంలో వాతావరణ శాఖ ఈ నెల 24వ తేదీ నుంచి వర్షాలు కురవచ్చనే ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. కోతలు సాగించాల వద్దా అన్న సందిగ్ధంలో పడ్డారు. అలాగే వదిలేస్తే పంట నేలవాలుతుంది, కోయించి దిగుడులను ఆరబెడితే గింజలు తడుస్తాయన్న భయం వేదిస్తోంది.

ఐదెకరాలు కౌలుకు తీసుకున్నా



ఎకరా రూ.20వేల ప్రకారం ఐదెకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేశా. ఎకరానికి రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టాను. పంట ఏపుగా పెరిగింది ఒక్కో ఎకరానికి 40 క్వింటాళ్ల మేర దిగుబడులు వస్తాయని ఆశించాను. క్వింటా రూ.2వేల ప్రకారం విక్రయించినా ఎకరానికి రూ.80వేలు వస్తుంది. పెట్టుబడి, కౌలు పోనై రూ.30వేల ప్రకారం ఐదెకరాలకు రూ.1.50 లక్షల దాకా ఆదాయం వస్తుందని భావించా. అయితే ఇటీవల కురిసిన వడగండ్లవాన పంట మొత్తాన్ని నేలపాలు చేసింది. ప్రస్తుతం కోతలు సాగిస్తున్నా. దిగుబడులు తగ్గడంతో పాటు ఖర్చులు పెరిగి అకాల వర్షాలు నష్టాలు మిగిలించాయి.

– రామారావు,కౌలు రైతు ఎల్లావత్తుల

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి


గోస్పాడులో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోస్పాడు: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గోస్పాడు వైద్యాధికారి డాక్టర్ గోపాల్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చేయి చేయి కలుపుదాం-క్షయను తరమికొండదాం అనే కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి సోకే మార్గాలు, వ్యాధి లక్షణాలపై వివరించారు. ఎక్కువ రోజుల పాటు దగ్గు ఉండి మందులు వాడినా జబ్బు తగ్గని వారు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం మందులను ఉచితంగా అందజేస్తుందన్నారు. ఈ వ్యాధి ఒకరి నుండి మరొకరికి సోకే అంటువ్యాధి అని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: గ్రామాల్లో క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ అంజలి సూచించారు. చాగలమర్రిలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మందులు వాడుతున్న 21 మందికి రూ.500 విలువైన నిత్యావసర సరుకులను అందజేశారు.సీహెచ్‌ఓ రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ, సూపర్‌వైజర్‌లు రామచంద్రుడు, సీతారాముడు, ప్రవీలమ్మ పాల్గొన్నారు.

దొర్నిపాడు: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో ఎంసీహెచ్‌పీ విమల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహిచారు. క్షయ వ్యాధిని మందుల వాడకంతో నివారించుకోవచ్చన్నారు. క్షయ వ్యాధికి ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా మందులు లభిస్తాయని చెప్పారు.

ఉయ్యాలవాడ : క్షయ వ్యాధి నివారణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నాయని వైద్యాధికారులు రాబర్ట్ కెనడి, అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి దినాన్ని పురస్కరించుకుని వ్యాధిగ్రస్తులకు మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా మందులు, పౌష్టికాహారాన్ని అందజేశారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి


రికార్డులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

శిరివెళ్ల: పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల డివిజన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక సబ్‌పోస్టాఫీస్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తపాలా గ్రామీణ జీవితా బీమా 29 వార్షికోత్సవాలు జరుగుతున్నాయన్నాయన్నారు. పథకాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఆడపిల్లల భవిష్యత్ కోసం సుకన్య పథకం అమల్లో ఉందన్నారు. 0-10 ఏళ్ల బాలికలకు ఏటా రూ.1.50లక్షల చొప్పున డిపాజిట్ చేస్తే 18 ఏళ్లలో రూ. 60 లక్షలు డ్రా చేసుకోవచ్చన్నారు. డివిజన్‌లో ఇంత వరకు 23 వేల మంది డిపాజిట్ చేశారన్నారు. అలాగే బాలుర కోసం పీపీఎఫ్ పథకం కూడా అమల్లో ఉందన్నారు. ఏటా రూ. 1. 50 లక్ష డిజిట్ చేస్తే 21 ఏళ్లల్లో రూ.49 లక్షలు డ్రా చేయవచ్చన్నారు. ఇంత వరకు 7,460 మంది డిపాజిట్ చేశారని వివరించారు. ప్రస్తుతం అన్ని బ్రాంచ్‌లలో 1.40 వేల మంది ఆర్‌డీలు కడుతున్నారని, స్థానిక పోస్టాఫీస్‌లో 139 మంది సుకన్య పథకం కింద డిపాజిట్ చేస్తున్నారన్నారు. 830 మంది ఆర్‌డీలు కడుతున్నారని పేర్కొన్నారు. పోస్ట్‌మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో టీబీని అరికడదాం


డాక్టర్ సునీతకు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న జిల్లా వైద్యాధికారులు

బొమ్మలసత్రం: పౌష్టికాహారంతో టీబీ వ్యాధిని అరికట్టవచ్చని, దీనికి తోడు ప్రభుత్వం అందజేసే మందులతో వ్యాధి సోకిన వారు ఆరోగ్యంగా ఉంటారని డీఎం అండ్‌హెచ్‌ఓ ఆర్ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది స్థానిక సర్వజన ఆసుపత్రి నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా పరీక్షలు జరపడమే కాకుండా మందులు, పౌష్టికాహారం అందజేస్తున్నామని చెప్పారు. వ్యాధి గ్రస్తులకు మెరుగైన సేవలు అందించిన డాక్టర్ సునీత, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా టీబీ , లెప్రసీ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ బాలాజీ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలత, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రసాదరావు, జఫ్రుల్లా, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు రవి కృష్ణ, డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఆళ్లగడ్డ: వినయోగారుల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వినియోగదారులు రక్షణ మండలి అధ్యక్షుడు విజయ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అహోబిలం గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో మేలు కొలుపు- కన్స్యూమర్ క్లబ్ ఏర్పాటులో భాగంగా ఆయన చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశనుంచే వినియోదారుల రక్షణ చట్టం గురించి అవగాహన కల్గించడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు.

ముమ్మరంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఏఈ రామసుబ్రహ్మణ్యం ఆదేశాల మేరకు లైన్‌మెన్ నాగన్న, సర్పంచ్ శివరామిరెడ్డి శుక్రవారం పనులు చేయించారు. నూతన స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు ఒరిగిన స్తంభాలను, తీగలను లాగి సరి చేశారు. దీంతో చాలా కాలంగా ఇబ్బంది పెడుతున్న విద్యుత్ సమస్యలు పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎండ తీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(సిటీ): ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్నందున జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఈఓ అనురాధ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో తాగునీటి సమస్య లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు తరగతి గది దాటి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న పాఠశాలల్లో మిగిలిన తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం పూట తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.

ప్రథమ నందిలో స్వచ్ఛభారత్

నంద్యాల(వ్యవసాయం): ప్రథమనంది దేవాలయ ఆవరణలో మన ఊరు-మనగుడి, మన బాధ్యత నిర్వాహకుల ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పాల్గొని కంపచెట్లు, ముళ్ల పొదలను తొలగించారు. గుంటూరు ఫ్యాక్టరీ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ నాల్గవ తేదీన చాగంటి కోటేశ్వరరావుచే ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేశామని, అందుకు అనుగుణంగా ఆలయంలో పరిశుభ్రత పనులు చేపట్టామని చెప్పారు. గోళ్ల సుదర్శనం, పబ్బు బాలచంద్రుడు, కేశవ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


శిరివెళ్లలోని పరీక్ష కేంద్రం

శిరివెళ్ల: ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పరీక్షల నిర్వహణకు మండలంలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల కేంద్రంలో 140 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. కేంద్రం చీఫ్ సూపరిండెంట్‌గా విజయకుమార్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌గా షాఫకృద్దీన్ నియమితులయ్యారు. మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 130 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండంగా కేంద్రం చీఫ్‌గా ఇస్రత్‌బేగం, డీఓగా మాబీబాషాను నియమించారు. యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఏ పరీక్షా కేంద్రంలో 133 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా చీఫ్‌గా విజయకుమార్, డీఓగా ఖాజామొయిద్దీన్ వ్యవహరించనున్నారు. బీ పరీక్ష కేంద్రంలో 170 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండంగా చీఫ్‌గా శ్రీనివాసరావు, డీఓగా సుందరయ్య విధులు నిర్వర్తించనున్నారు. పరీక్షలకు సంభందించి రెండు సెట్‌ల పరీక్ష ప్రశ్న పత్రాలను పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు.

వ్యవస్థాపక మనస్తత్వంతో అభివృద్ధి

నంద్యాల(సిటీ): విద్యార్థులు వ్యవస్థాపక మనస్తత్వంతో ముందుకు సాగాలని డీఈఓ అనురాధ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్‌పీజీ ఉన్నత పాఠశాలలో ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్ సెట్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో కొత్త ఆలోచనలను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. జిల్లా స్థాయిలో నమోదైన 180 ప్రదర్శనలను పరిశీలించారు. ఈ ప్రాజెక్టులలో ఉత్తమమైన 10 ప్రాజెక్టులను జిల్లా స్థాయి ప్రదర్శనల్లో ఉంచారు. జిల్లా స్థాయిలో ఎంపికైన 2 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారన్నారు. గోస్పాడు మోడల్ పాఠశాల విద్యార్థులు కే.ఏ న్.శ్వేత బృందం, గైడ్ టీచర్ అమీర్ సుహైల్ ఆధ్వర్యంలో తయారు చేసిన ఆటోమేటిక్ ఓపెన్ డోర్ ప్రాజెక్టు మొదటి ప్రైజ్‌కు ఎంపికైందన్నారు. ఆళ్లగడ్డ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని కే.లక్ష్మీ బృందం, గైడ్ టీచర్ చెన్నకేశ్వరి ఆధ్వర్యంలో సీలింగ్ క్యాచర్‌ను తయారు చేసి జిల్లా స్థాయి ద్వితీయ స్థానానికి ఎంపికయ్యారన్నారు. కన్సొలేషన్ కింద రేగడగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సమీర, గైడ్ టీచర్ షఫీఉల్లా తయారు చేసిన స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు కన్సొలేషన్ బహుమతి అంజేశారు. ఎంపికైన రెండు ప్రాజెక్టులు ఈనెల 28వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సైన్సు అధికారి సుందర్‌రావు, అసిస్టెంట్ ఏఎంఓ రఫీ, ఈఎండీపీ కో ఆర్డినేటర్ గోపాల్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలు తీసుకోవాలి

ఆళ్లగడ్డ: గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలను తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి తెలిపారు. పట్టణంలోని 15, 24 అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పౌష్టికాహార వారోత్సవాలను నిర్వహించారు. చిరుధాన్యాలు, బాలమృతం, పోషణ, పోషణ్ ప్లస్ వంటి వాటిపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

8 లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్


మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకం కింద చేపట్టిన 1,672 గృహాల ఉగాది నాటి లక్ష్యాన్ని వచ్చేనెల 8వ తేదీ లోపు పూర్తిస్థాయిలో సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ హౌసింగ్ ఇంజినీర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో గృహ నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు 310 గృహాలు పూర్తి చేశారని, మిగిలిన లక్ష్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేయాలన్నారు. 67 లేఔట్లలో 10 ఇళ్లకు పైగా పూర్తయ్యాయని సంబంధిత గృహాలకు నీటి సరఫరా, విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

సర్వే వేగవంతం చేయండి

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వే వేగవంతం చేసి ప్రభుత్వం నిర్దేశించిన సర్వీసులను నిర్ణీత కాల వ్యవధిలోగా అందించేందుకు ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సచివాలయాల సర్వీసులు, ఉపాధి హామీ లేబర్ మొబలైజేషన్ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ, పుట్టిన తేదీ సర్టిఫికెట్లతో ఆధార్ అనుసంధానం, ఆయుష్మాన్ భారత్ సర్వే, హెల్త్ కార్డు సర్వే తదితర అంశాల్లో వచ్చే గురువారానికి పురోగతి కనిపించాలని చెప్పారు. ఏపీ సేవా సర్వీసులలో జిల్లా దిగువ నుంచి 5వ స్థానంలో ఉందని సర్వీసులలో పురోగతి తీసుకురావాలన్నారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆధార్ అప్‌డేషన్ పూర్తి చేయాలన్నారు. డోన్, కోవెలకుంట్ల, నంద్యాల క్లస్టర్‌లలో ఉపాధి హామీలో లేబర్ మొబలైజేషన్ తక్కువగా ఉందన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోండి

వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎండిపోయిన బోర్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. పాఠశాలలు, గ్రామాల్లో పని చేయని ఆర్‌ఓ ప్లాంట్‌లను గుర్తించి మరమ్మతులు చేయాలని సూచించారు. పట్టణంలో మూడు పవర్ బోర్ వెల్స్‌ను తక్షణం వినియోగంలోకి తీసుకు రావాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని ఆదేశించారు. ఈ వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఐఎండీ హెచ్చరిస్తున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ మున్సిపల్, మండల కేంద్రాల్లో చలివేంద్రాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ పోలీసులకు కూలింగ్ జాకెట్లు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతి, అడిషనల్ ఎస్పీ రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, డీపీఓ శ్రీనివాసులు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, డీఎల్‌డీఓ జనార్దన్ పాల్గొన్నారు.

30 లోపు ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలి

జిల్లాలోని ఓటరు కార్డును ఆధార్‌తో అనుసంధాన ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ మనజీర్ తహసీల్దార్లను ఆదేశించారు. పీఓఏల్‌ఆర్ రీ సర్వే, ఫారం-6బీ, భూసేకరణ, ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవెన్యూ అంశాలపై మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో 74,583, ఆత్మకూరులో 15,830, వెలుగోడులో 11,501మంది ఓటర్లను ఆధార్‌తో అనుసంధానం చేయాల్సి ఉందన్నారు. ఈనెల 25, 26 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. ఎయిర్ క్రాఫ్ట్ సర్వే కు సంబంధించి 84 గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న చెక్ పాయింట్లను ఈనెల 30వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. రీసర్వే పూర్తి చేసిన గోస్పాడులో 1270, శిరివెళ్లలో 903, కానాలపల్లిలో 1629 తదితర గ్రామాల్లో సరిహద్దు రాళ్లు నాటే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. మండలాల వారీగా ఇళ్ల పట్టాలు మంజూరు చేసిన లబ్దిదారుల వివరాలను సేకరించి రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఎస్‌డీసీ కామేశ్వర రావుకు సూచించారు. డీఆర్‌ఓ పుల్లయ్య, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్‌డీఓలు శ్రీనివాసులు, వెంకట్ రెడ్డి, ఎం.దాసు పాల్గొన్నారు.

సత్తా చాటిన దర్శి ఎద్దులు


ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రకాశం జిల్లా దర్శి గ్రామానికి చెందిన రాజశేఖర్ ఎద్దులు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో మొదటి స్థానం సాధించాయి. మండలంలోని సాంబవరం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకొని అంకాలమ్మ తిరునాల సందర్భంగా నిర్వహించిన ఎద్దుల పోటీల్లో శుక్రవారం న్యూకేటగిరీ విభాగం ఎద్దుల పోటీలను డాక్టర్ జూపల్లె రాకేష్‌రెడ్డి ప్రారంభించారు. సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి ఎద్దులు రెండో స్థానం, గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన రవితేజశ్వరరెడ్డి ఎద్దులు మూడో స్థానం, బొల్లవరం గ్రామానికి చెందిన వెంకటరమణ ఎద్దులు నాల్గో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా..రూ.40 వేలు, రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలను నిర్వాహకులు అందజేశారు.

మోడల్ స్కూల్ విద్యార్థిని ప్రతిభ

గోస్పాడు:స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థిని నాగశ్వేత ఈఎండీపీ సైన్స్ ప్రాజెక్టులో జిల్లాలో మొదటి స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ ఖాజాహుసేన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినికి డీఈఓ అనురాధ ప్రశంసా పత్రం అందజేశారు. సైన్స్ ప్రాజెక్టులో జిల్లాలో మొదటి స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 28న విజయవాడలోజరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొంటుందని చెప్పారు. ఇదిలా ఉండగా.. పాఠశాలకు చెందిన పదిమంది విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


సుబ్బనాగ విశ్వనాథ్

నంద్యాల(సిటీ): జాతీయ స్థాయి సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు నంద్యాల నెరవాడ కేశవరెడ్డి పాఠశాల విద్యార్థి సుబ్బనాగ విశ్వనాథ్ శుక్రవారం ఎంపికైనట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రతినిధులు మహబూబ్‌బాషా, రామేశ్వరరెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ జనవరి 13, 14వ తేదీల్లో కృష్ణా జిల్లా గన్నవరంలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో నంద్యాల జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ పోటీల్లో ఎస్.నరేష్, డి.దస్తగిరితో పాటు సుబ్బనాగ విశ్వనాథ్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు అసోం రాష్ట్రంలోని గౌహతిలో జరిగే సబ్ జూనియర్ బాలుర జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.